క్లుప్తంగా

పేద కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి రేషన్ ఇస్తున్న విజయ్‌భాస్కర్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతి నగర్ ప్రాంతంలో ఓ పేద కుటుంబానికి స్థానిక బీఎస్ఎఫ్ ప్రతినిధులు సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీనికి తోడు ఇటీవల ఆమె కుమార్తె మృతి చెందడంతో ఆమె పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. విషయం తెలుసుకున్న బీఎస్ఎఫ్ ట్రస్టు ఫౌండర్ పూడి విజయభాస్కర్ శనివారం ఆ మహిళ ఇంటికి వెళ్లి బియ్యం,నిత్యావసర సరకులు అందించారు. మూడు నెలల పాటు ఇదే మాదిరిగా సాయం అందిస్తానని భాస్కర్ ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ట్రస్టు ప్రతినిధులు, హెల్పింగ్ గైస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం గౌరీ సేవా సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గణబాబు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరీ సేవా సంఘం సభ్యులు అందరి మన్ననలు పొందే విధంగా కార్యాచరణ చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గోపాలపట్నం గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు ఉల్లూరి కనకరాజు, కార్యదర్శి పొలిమేర ప్రసాద్, కోశాధికారి వెంకటప్పారావు, మహిళా సంఘం అధ్యక్షురాలు పొలిమేర జగదీశ్వరి, కార్యదర్శి మళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అవశ్యం



మొక్కలు నాటుతున్న కోస్టుగార్డు అధికారులు

మల్కాపురం: ఇండియన్ కోస్టుగార్డ్ 47వ రైజింగ్ డే సందర్భంగా కోస్టుగార్డ్ ప్రధాన కార్యాలయం (మల్కాపురం) పరిసరాల్లో శనివారం ఉదయం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కోస్టు గార్డ్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రైజింగ్ డే ను పురస్కరించుకొని సుమారు 500 మొక్కలు నాటినట్టు అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు.చెత్తాచెదారాలు దూరంగా తరలించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

మల్కాపురం: క్రీడల్లో రాణి స్తే ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని మల్కాపురం సీఐ లూథర్‌బాబు అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్‌లోని భాష్యం పాఠశాలలో శనివారం నిర్వహించిన స్పోర్ట్సు మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నచ్చిన క్రీడల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు దేశభక్తి గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



భవిష్యత్తు తరాల కోసం ఆలోచించండి

జెడ్సీ మల్లయ్యనాయుడు



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: మన భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించాలనే ఉద్దేశంతో తడి పొడి, ప్రమాదకర చెత్తను వేరుచేసి ఇవ్వాలని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు సూచించారు. పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై శనివారం సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి , దుకాణాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై భారీ జరిమానాలు విధిస్తున్నామని, ఆ జరిమానాలకు బలికావద్దని సూచించారు. ఇందుకు అత్యున్నత న్యాయస్థానం సూచనలు చేసిందన్నారు. ప్లాస్టిక్ వల్ల భూమి కలుషితమవుతోందని తెలిపారు. భవిష్యత్తు తరాలు మంచి వాతావరణాన్ని, గాలి, నీటి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వాతావరణ సమతుల్యత కోల్పోయి మానవ సమాజం ప్రమాదకర స్థితిలోకి వెళ్లి పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా విడనాడి, ప్రత్యామ్నాయంగా నార, గుడ్డ సంచులు వాడాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ వెంకటరమణ, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే విజయ తీరాలకు..

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు నాగేశ్వరరావు



మహిళా క్రికెటర్ షబ్నంను సత్కరిస్తున్న బెహరా భాస్కరరావు, విజయచైతన్య తదితరులు

గోపాలపట్నం: చెడును దూరం చేసి.. మంచి నడవడిక అలవర్చుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వరరావు అన్నారు. నరవ బెహరా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విశాఖకే వన్నె తెచ్చిన అండర్–19 మహిళా ప్రపంచ కప్ విజేత జట్టు సభ్యురాలు షబ్నంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రమను సౌఖ్యంగా భావిస్తే అది విజయాలు అందిస్తుందని చెప్పారు. ఓటమి అనేది గెలుపునకు తొలి మెట్టు అవుతుందన్నారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లికి మించిన గురువు విశ్వంలో లేరని చెప్పారు. తల్లి దండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుందని దాన్ని గుర్తించాలని తెలిపారు. మనపై మనకు నియంత్రణ ఉంటే మనల్ని మనం గ్రంహించుకోగలమని వివరించారు. జ్ఞాపక శక్తి అందరిలో ఉంటుందని అయితే ప్రాధాన్యత అంశాలు, వాటిని మనకు అవసరమైనపుడు అందుబాటులో ఉంచుకునే విధానాలను వివరించారు. ప్రణాళిక బద్ధంగా శ్రమిస్తే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని చెప్పారు. బెహరా విద్యా సంస్థల చైర్మన్ బెహరా భాస్కరరావు, కళాశాల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య , 92వ వార్డు కార్పొరేటర్ బీవీవీఎస్ దేవి, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ మీటర్ బాక్స్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద ఓ స్తంభానికి ఆ ప్రాంతంలో విద్యుత్ ఎల్ఈడీ లైట్లు వెలిగించేందుకు జంక్షన్ బాక్స్, మీటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే లైట్లు వెలిగించేందుకు ఏర్పాటు చేసిన జంక్షన్ బాక్స్ (ఫ్యూజ్ కటౌట్)కు తగిలించిన వైర్లు గాలిలో వేలాడుతున్నాయి. పొరపాటున ఎవరైనా ఈ స్తంభం దగ్గరకు వెళ్లి వైర్లను ముట్టుకుంటే వారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అధికారులు ఈ సమస్యపై స్పందించాలని స్థానిక వాసులు కోరుతున్నారు.

ఉక్కు ఉద్యమానికి కేంద్రం తలవంచాల్సిందే



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్

కూర్మన్నపాలెం: కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమ సెగకు కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని, కార్మిక శక్తికి ప్రపంచ దేశాలే తలవంచాయనే నిజాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం గ్రహించలేకపోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. 723వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులను ద్దేశించి ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజీత్ కౌర్, పోరాట కమిటీనాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్య రామ్, ఏపీ స్టేట్ సెక్రటరీ పడాల రమణ మాట్లాడుతూ ఒక వైపు ఉక్కు ఉత్పత్తిని పరుగులు పెట్టిస్తూనే కర్మాగారాన్ని రక్షించుకునేందుకు కార్మికులు దీక్ష చేయడం గొప్ప విషయమన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై తమకున్న పట్టుదల, ఉక్కు కార్మికుల ఐక్యతను చాటే విధంగా భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తున్నామని, కార్మిక వర్గ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టిన గతే బీజేపీ ప్రభుత్వానికి పడుతుందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

భక్తులకు అల్పాహారం పంపిణీ



భక్తులకు అల్పాహారం అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: వ్యాకుల మాత భక్తులకు శనివారం ఉదయం అల్పాహారాన్ని శాంతినగర్ మెయిన్ రోడ్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందించారు. కొత్తవలసలోని వ్యాకుల మాత పుణ్యక్షేత్రానికి జ్ఞానాపురం నుంచి నడిచి వెళ్లి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా భక్తులకు తినుబండారాలను స్థానికులు పైడి కొండల కనకరాజు, జ్యోతి తంపతులు సౌజన్యంలో అందజేశారు. ఏటా ఈ భక్తుల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని శ్రీధర్ తెలిపారు.

ఉక్కు కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలి



ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ శ్రేణులు

ఉక్కునగరం: ఉక్కు కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం అమలు చేయాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప డిమాండ్ చేశారు. శనివారం ఈ అంశంపై ఉక్కు అడ్మిన్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయిల్‌లో వేతన ఒప్పందం అమలు జరిగి 15 నెలలు పూర్తయినా ఇక్కడ చేయకపోవడం అన్యాయమన్నారు. నూతన వేతనాలు కోసం యువ కార్మికులు ఎదురు చూస్తున్నారని, నూతన వేతనాల జాప్యం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా రిటైర్ అవుతున్న ఉద్యోగులు పెరుగుతున్నా నూతన నియామకాలు చేయకపోవడం వల్ల సిబ్బంది కొరత ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత గుర్తింపు సంఘం చేతకాని తనం వల్ల యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. కార్యక్రంలో కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, మార్పుపూడి పరదేశి, ఎం. జగ్గారావు, పిట్టారెడ్డి, డి. పుల్లారావు, కె. జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గోపాలపట్నం: గోపాలపట్నం ఎస్ఆర్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఉంటుందని నిర్వాహకుడు ఈ. సత్యానంద్ కుమార్ తెలిపారు. శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు, బీపీ, షుగర్, పరీక్షలతో పాటు ఎముకల సాంద్రత పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు.

'నూతన సామాజిక ఒరవడి'పై వాక్‌థాన్



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ప్రసాద్

సీతమ్మధార: ధాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజియన్ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నూతన సామాజిక ఒరవడి అనే అంశంపై వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ థీమ్‌పై ఫౌండేషన్ మహిళలు నినాదాలు చేస్తూ వాక్ నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ పూర్వ డైరెక్టర్ ప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ధాన్ ఫౌండేషన్ రీజనల్ కో ఆర్డినేటర్ శైలజ మాట్లాడుతూ వాకథాన్ థీమ్స్ ఉద్దేశాన్ని సభ్యులందరికీ వివరించారు. ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్ జానకీరామన్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లల్లో మంచి విలువలను పెంపొందించాలని, తల్లులు ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ జీవనోపాధిపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భానుప్రకాష్, సమాఖ్య నాయకులు ఆదిలక్ష్మి, గౌరీ, నళిని, లీల, షబీద, రమ, కళంజియా సభ్యులు పాల్గొన్నారు.

కలియుగ వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

స్కౌట్స్, గైడ్స్ ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన స్కౌట్ మాస్టర్లు

సీతంపేట: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శనివారం స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు, రోవర్ స్కౌట్ లీడర్లు, రేంజర్ లీడర్ల శిక్షణ శిబిరం ప్రారంభమైంది. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కళాశాల, పాఠశాలలో తప్పనిసరిగా స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థాపించాలని సూచించారు. రాష్ట్ర శిక్షణాధికారులు బి.ఉమాదేవి, మోహన్‌రావు శిక్షణ ప్రాముఖ్యాన్ని వివరించారు. రేంజర్ విభాగం నుంచి 45 మంది, స్కౌట్స్ విభాగం నుంచి 55 మంది శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యక్షుడు నరవ ప్రకాశరావు, రాష్ట్ర కమిషనర్ శకుంతల, క్యాంప్ లీడర్ ఎస్.వెంకటేశ్వర్లు, శిక్షకులు పి.సుశీల, డి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: రైలు కింద పడి సుమారు 30–35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి సింహాచలం నార్త్ స్టేషన్ సమీపంలో మరణించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో ఎస్ఐ బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి వెళ్తున్న 13352 బొకారో ఎక్స్‌ప్రెస్ కింద పడి గానీ, ఇదే రైలు నుంచి జారిపడి గానీ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 96661 22722 నంబర్‌లో గానీ తెలియజేయాలని కోరారు.

అలరించిన గాత్ర కచేరి

సీతంపేట: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకులు నిష్టల కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ బీవీకే శాలలో డాక్టర్ కె.వందన చేసిన గాత్ర సంగీత కచేరి ఆహుతులను అలరించింది. తిరుపతి శ్రీవెంకటేశ్వర సంగీత కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న వందన తన అద్భుత గాత్రంతో వీనుల విందు చేశారు. నన్ను విడచి కదలకురా అనే రీతి గౌళ రాగకృతి, నే పొగడకుంటే అనే శుభపంతువరాళి రాగకృతి, స్వరరాగసుధ అనే శంకరాభరణ రాగకృతి కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. వీరికి మంథా శ్రీరమ్య వయోలిన్‌పై, పి.ఎస్.ఫల్గుణ మృదంగంపై వాద్య సహకారం అందించారు. త్యాగరాజ ఉత్సవాల సందర్భంగా పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథి మృదంగ విద్వాంసుడు వంకాయల వేంకట రమణమూర్తి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

సింహాచలం: మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెందుర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు..పెందుర్తిలోని తమిళనాడు మార్కెట్‌లో పనిచేస్తున్న అరవింద్ స్వామి సెంథిల్‌కుమార్(26) తల్లి మదమ్మ సెంథిల్‌కుమార్‌తో కలిసి పెందుర్తిలో నివసిస్తున్నాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఎక్కువగా ఉంది. ఈతరుణంలోనే ఈనెల 2వతేదీన తల్లితో గొడవపడి ఇంట్లో తనగదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. మూడోతేదీ మధ్యాహ్నం వరకు బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చితలుపులు బద్దలు కొట్టిచూడగా ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కేంద్రం తీరుపై కార్మికులు ఐక్యంగా పోరాడాలి

● సీఐటీయూ అధ్యక్షుడు శ్రీనివాసరావు



మహాసభలో పాల్గొన్న షిప్‌యార్డ్ లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ నాయకులు

సింధియా: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని విశాఖ జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాసరావు అన్నారు. మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం షిప్‌యార్డ్ లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, షిప్‌యార్డ్‌కు నామినేషన్ పద్ధతిలో వర్క్ ఆర్డర్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే మీల్స్ అలవెన్సు రివైజ్ చేయాలని, వర్క్‌మెన్ టూ స్టాఫ్, స్టాఫ్ టూ ఆఫీసర్స్ ప్రమోషన్‌లు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలని మహాసభలో తీర్మానించారు. కార్యక్రమంలో కె . కుమారమంగళం, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి ఎంవీ రమణమూర్తి, మల్కాపురం జోన్ సీఐటీయూ ప్రెసిడెంట్ పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహాసభ అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జానకిరామ్, ప్రెసిడెంట్‌గా బీఎస్ఎస్ రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శి రాంజీఅంబేడ్కర్, కోశాధికారి పీఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 24 మంది ఆఫీస్ బేరర్స్, 16 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకున్నారు.

రైతు బజారులో మౌలిక వసతులు



రైతు బజారులో పర్యటిస్తున్న వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండే

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే శనివారం పర్యటించారు. బజారు పరిస్థితిని స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బజారులో అందుబాటులో ఉన్న సరుకుల నాణ్యత, ధరల పట్టికల నిర్వహణ వంటి అంశాలపై ఆరా తీశారు. బజారులో షెడ్లు, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాలు ఏవిధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. పాడైన షెడ్లను తొలగించి కొత్తవి వేయడం వంటి సమస్యలు ఉంటే ప్రతిపాదనలు పంపించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఏడీఎం ఎస్‌కే యాసిన్, డీడీ పాపారావు, ఈవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నేత్రపర్వం.. లలితాకామేశ్వరుల గ్రామోత్సవం



పల్లకీపై లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక రథంపై లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠం 74వ వార్షిక బ్రహ్మోత్సవాలు పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో రెండు వారాలుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం లలితా కామేశ్వరుల గ్రామోత్సవం పురవీధుల్లో నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలను చూడముచ్చటగా అలంకరించి పల్లకీపై భక్తులు ఊరేగించారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిని ప్రత్యేక రథంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని పర్యవేక్షణలో మహిళలు పెద్ద సంఖ్యలో రథయాత్రలో పాల్గొన్నారు.

అమ్మవారికి భక్తుల నీరాజనాలు

లలితానగర్‌లోని లలిత గుడి వద్ద ప్రారంభమైన ఊరేగింపు శంకరమఠం రోడ్, డైమండ్ పార్కు, దొండపర్తి, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. విద్యుత్ దీపాలు, అలంకరణ, సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఊరేగింపులో భక్తులు వేలాదిగా వెంటరాగా, అమ్మవారికి అడుగడుగునా భక్తులు హారతులిచ్చి, టెంకాయలు కొట్టి నీరాజనాలు పలికారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు పీఠంలో కాళీ కాలభైరవుల ప్రతిష్ట, విశేష పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కార్యక్రమంలో పీఠం ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్ శర్మ, సీఈవో మోచర్ల శశిభూషణ్ పాల్గొన్నారు.

వాకర్స్ సేవలు శ్లాఘనీయం



మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవీంద్ర

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు శ్లాఘనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్పీ రవీంద్ర అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం సాయంత్రం నిర్వహించిన క్లబ్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. వాకర్స్ క్లబ్ సభ్యులు నిస్వార్థంగా సేవలు చేస్తూ అందరి ప్రశంసలు అందుకున్నారన్నారు. నడక ప్రాధాన్యాన్ని తెలుపుతూనే ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.బాబూరావు రచించిన నాలో నేను అనే కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ యు.శుభ, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్, డాక్టర్ కె.బాబూరావు, కె.ద్వారకానాథ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



